క్లుప్తంగా

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): తల్లిదండ్రులను వృద్ధాప్యంలో జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావు అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని పొద్దుటూరి సదానందరెడ్డి వృద్ధాశ్రమాన్ని న్యాయమూర్తి శనివారం సందర్శించి మాట్లాడారు. వృద్ధులను గౌరవించాలన్నారు. అనంతరం చట్టంలో వృద్ధుల కోసం పొందుపరిచిన ప్రయోజనాలను వివరించారు. బాబాగౌడ్, జి.నివేదన్, అశోక్, సుదర్శన్ గౌడ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో విజ్ఞాన్ పాఠశాలలో సమ్మర్ క్యాంపులో భాగంగా శాస్త్రీయ సంగీత నృత్యాలను నేర్పించారు. శనివారం చివరి రోజు విద్యార్థులతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన శివతాండవం నృత్యం పలువుర్ని ఆకట్టుకుంది.

ఒత్తిడిని తగ్గించే యోగాసనాలు

రుద్రూర్: ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో బీపీ(ఒత్తిడి) తగ్గించే యోగాసనాలు నేర్పించారు. అనంతరం యోగా సమితి మీడియా కో–ఆర్డినేటర్ మహాజన్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. యోగాసనాల వల్ల హైబీపీతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టవచ్చునన్నారు. రక్తపోటు నియంత్రణకు యోగాసనాలు వేయాలని సూచించారు. పతంజలి యోగ సమితి అధ్యక్షుడు కేవీ మోహన్, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో అర్బన్ హెల్త్‌సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్యాధికారులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్.. హైపర్‌టెన్షన్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ గురించి వివరించారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, తక్కువ ఉప్పు, ఎక్కువ పొటాషియంతో కూడిన ఆహారం తీసుకోవాలని, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని అన్నారు. డాక్టర్ ఫాతిమా, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, ఫార్మాసిస్ట్ సురేష్, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కితీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు యాసడ నర్సింగ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన ముదిరాజ్ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈటలపై ఎవరైనా నోరు జారితే ఊరుకోమన్నారు. ఇష్టంవచ్చినట్లు మాట్లాడితే తగిన బుద్ధి చెపుతామన్నారు. జిల్లా యువజన అధ్యక్షుడు మందుల బాలు, ఎల్లన్న, శిల శ్రీనివాస్, జక్కం కార్తిక్, పోశెట్టి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

బాల్కొండ: రైతులు భూసార పరీక్షలను తప్పకుండా చేయించాలని 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య అన్నారు. శనివారం మెండోరా మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేపట్టడం ద్వారా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, ఏవో వైష్ణవ్, ఉద్యాన వన శాఖ అధికారి రుద్ర వినాయక్, సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, శాస్త్రవేత్తలు అమల, రాజుకుమార్, వెటర్నరీ వైద్యుడు గౌతంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రుద్రూర్: అంబం(ఆర్)లో శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై రుద్రూర్ ఎస్సై సాయన్న అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. యువకులు ఆన్లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ, వ్యక్తిగత సమాచారం చెప్పవద్దన్నారు. ఆదివారం రుద్రూర్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై పెద్ద ఎత్తున ర్యాలీ ఉంటుందని ద్విచక్ర వాహనదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు ఆర్.గంగారాం, ఆర్.సాయిలు, లింగం, హెడ్ కానిస్టేబుల్ సురేష్, తదితరులున్నారు.

మూత'బడి' పోయాయి..!

- నాలుగేళ్ల నుంచి నిరుపయోగంగా దూదిగాం, వెల్కటూర్ పాఠశాలలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



వెల్కటూర్‌లో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం



దూదిగాంలోని పాఠశాల భవనం

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాం, వెల్కటూర్ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు నాలుగేళ్ల క్రితం మూతబడ్డాయి. అప్పటి నుంచి ఆ పాఠశాలల భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. దూదిగాం పాఠశాల పక్కన గల కాలనీని నెహ్రూనగర్ కాలనీకి తరలించడంతో అక్కడ పిల్లలు లేకుండా పోయారు. నెహ్రూ నగర్‌లోనే ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించడం వల్ల దూదిగాంలోని పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. వెల్కటూర్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రోజు రోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఆ పాఠశాల విద్యార్థులను ఉన్నత పాఠశాల ఆవరణలో గల ప్రాథమిక పాఠశాలలోకి తరలించారు. దీంతో అక్కడ పాఠశాల ఖాళీ అయింది. దీంతో పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంది. నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు పక్కా భవనాలు లేక అనేక గ్రామాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి నిరుపయోగ భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కాని అటు వైపు ఎవరూ దృష్టి సారించడం లేదు. దీంతో ఆ పాఠశాల భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అంతే కాకుండ పాఠశాల భవనాల కిటికీలు, తలుపులు దొంగలెత్తుకెళ్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే వాటిని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే ఉపయోగంలోకి వస్తాయి. ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గ్రామంలోని మరో పాఠశాలకు తరలించారు. దీంతో ఆ పాఠశాల భవనం కూడా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం అందులో రేషన్ షాపు నిర్వహిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

దూదిగాం, వెల్కటూర్‌లో నిరుపయోగంగా ఉన్న పాఠశాలల భవనాల గురించి ఉన్నత అధికారులకు నివేదించాం. ఉన్నత అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా వెంటనే అమలు చేస్తాం.

– శ్రీనివాస్, ఎంఈవో, మెండోరా

మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): రైతులు మోతాదుకు మించి ఎరువులను వినియోగించవద్దని ఆలూర్ తహసీల్దార్ రమేష్, ఏవో రాంబాబు సూచించారు. ఆలూర్ సొసైటీ గోదామును అధికారులు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు పాస్ పద్ధతి ద్వారా అధికారులు నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని స్పష్టం చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. ఆలూర్ గోదాంలో 80.2 మెట్రిక్ టన్నుల యూరియా, 102 మెట్రిక్ టన్నుల డీఏపీ, 14.15 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 38.6 మెట్రిక్ టన్నుల ఎస్‌పీకే నిలువలున్నట్లు అధికారులు గుర్తించారు. సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్, ఎంపీడీవో గంగాధర్, ఏడీఏ విజయలక్ష్మి, సీఈవో మల్లేష్, ఏఈవో వసుదాం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌తో భేటీ



బీజేపీ ఎంపీ అర్వింద్‌తో మేడపాటి ప్రకాశ్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు

బోధన్‌టౌన్(బోధన్)/నవీపేట: నియోజకవర్గంలోని వివిధ మండలాల బీజేపీ నూతన అధ్యక్షులు.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో భేటీ అయ్యారు. రానున్న స్థానిక, మున్సిపల్ ఎన్నికల విషయమై ఆయనతో చర్చించారు. అలాగే నవీపేట మండల కేంద్రంలో ఆర్వోబీ నిర్మాణ విషయమై మాట్లాడినట్లు బీజేపీ నవీపేట అధ్యక్షుడు ద్యాగ సరిన్ తెలిపారు. రైల్వే అధికారులతో మాట్లాడానని, త్వరలోనే ప్రకటన వెలువడుతుందని ఎంపీ చెప్పినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌చారి, వివిధ మండలాల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, కోల ఇంద్రకరణ్, సరీన్, గంగాధర్, యోగేష్‌లు ఉన్నారు.

ఇసుక వ్యవహారంపై ఎమ్మెల్యే స్పందించాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత రవీందర్

బోధన్‌టౌన్(బోధన్): ఇసుక వ్యవహారంపై ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పందించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. సిద్దాపూర్, ఖండ్గాం ఇసుక క్వారీల్లో జరుగుతున్న అక్రమాల గురించి పాత్రికేయులు నిజాలు రాస్తే సహించని వ్యక్తులు వారి దిష్టిబొమ్మలను దహనం చేయడం సరికాదన్నారు. నాయకులు రజాక్, గంగారాం, రేకం దాసు, జాదవ్, సాగర్, జాకీర్ అహ్మద్, షేక్ మహ్మద్, తదితరులున్నారు.

దిష్టిబొమ్మ దహనం సరికాదు: బీజేపీ

ఇసుక మాఫియాపై నిజాలు రాసిన పత్రికా విలేకరుల దిష్టిబొమ్మను దహనం చేయడం సరికాదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి అన్నారు. శనివారం పట్టణంలోని బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మీడియా మిత్రులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్, వివిధ మండలాల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, కోల ఇంద్రకరణ్, సరీన్, గంగాధర్, యోగేష్ పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



విత్తనాలు అందజేస్తున్న పొద్దుటూరి వినయ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌తో పాటు ఆలూర్ మండలంలో శనివారం రైతులకు జీలుగ విత్తనాలను అందజేశారు. పెర్కిట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఆలూర్, పెర్కిట్ సొసైటీ చైర్మన్లు తంబూర్ శ్రీనివాస్, పెంట భోజారెడ్డి పాల్గొన్నారు.

వేంపల్లి సొసైటీ ఆధ్వర్యంలో

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో సొసైటీ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్ మాట్లాడుతూ.. యూరియా వాడకం తగ్గించుకొని జీలుగ విత్తనాలను చల్లుకోవాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఒక్క వర్షానికే ఇలా.. రోజంతా పడితే ఎలా?



బురదమయంగా మారిన జీజీ నడ్కుడ రోడ్డు



అన్నారం నుంచి సిర్పూర్ వెళ్లే దారి..

డొంకేశ్వర్(ఆర్మూర్): ఒక్క వానకే మండలంలోని జీజీ నడ్కుడకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. బీటీ రోడ్డు తేలిపోయి గుంతలు తేలడంతో ఇటీవల అక్కడక్కడా మొరం పోశారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో రోడ్డు బురదతో అధ్వానంగా తయారైంది. కంకర తేలి గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. అలాగే అన్నారం నుంచి సిర్పూర్ వెళ్లే దారి మరీ ఘోరంగా తయారైంది. బురద రహదారిలా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. జీజీ నడ్కుడకు కొత్త రోడ్డు వేసేందుకు ఆర్అండ్‌బీ శాఖకు నిధులు మంజూరై ఏడాది గడుస్తోంది, కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు.



కుంటను తలపిస్తున్న రోడ్డు

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్‌లో పోశవ్వ మందిరం వెళ్లే దారిలోని సీసీ రోడ్డు వాన కురిస్తే నీటి కుంటలా తయారవుతోంది. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురువడంతో వర్షం నీరు సీసీ రోడ్డుపై నిలిచింది. ఈ కారణంగా కాలనీవాసులకు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇంటి నిర్మాణాలు ఎత్తులో నిర్మించడంతో రోడ్డు లోతుగా మారింది. దీంతో ఈ పరిస్థితి తలెత్తింది. అధికారులు స్పందించి నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



డొంకేశ్వర్(ఆర్మూర్): జీజీ నడ్కుడలో ఇందిరమ్మ ఇళ్లకు అధికారులు శనివారం భూమిపూజ చేశారు. గ్రామానికి ఐదు ఇళ్లు మంజూరు కాగా ఇద్దరు లబ్ధిదారులు ఇంటికి ముగ్గు పోశారు. జీపీ కార్యదర్శులు సుప్రియ, మోహన్, కమిటీ సభ్యులు ఉన్నారు.

హసాకొత్తూర్‌లో..



కమ్మర్‌పల్లి: హసాకొత్తూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏఎంసీ చైర్మన్ నర్సయ్య శనివారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, ఎంపీడీవో రాజశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా మండలానికి 210 ఇళ్లు

వర్ని(మోస్రా): మోస్రా మండలానికి 210 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాస్ వెల్లడించారు. తిమ్మాపూర్‌కు 150, గోవూరుకు 30, మోస్రా గ్రామానికి 40, చింతకుంటకు 20, చే–నెంబర్ తండాకు 10 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు.

అర్హులైన వారికే ఇళ్లు ఇవ్వాలి



ఫత్తేపూర్‌లో నిరసన చేపడుతున్న బాధితులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బాధితులు శనివారం నిరసన చేపట్టారు. బాధితులకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ నేత రాము నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు లబ్ధిదారులను గుర్తించి పథకాన్ని వర్తింప చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో లక్ష్మారెడ్డి

మాక్లూర్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ముందుకొచ్చి నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం చిక్లీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని ఎంపీడీవో లక్ష్మారెడ్డి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం ఉండదని, లబ్ధిదారులకు ఎంపీడీవో లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. పంచాయితీ కార్యదర్శి నవీన్‌కుమార్, కారోబార్ పి.సాయిలు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో దరఖాస్తుదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను శనివారం ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. 96 మందికి మంజూరైనట్లు నాయకులు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మంజూరు పత్రాలను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ జైడి రవి, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు బద్దం సాగర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, చిన్నారెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



అడ్మిషన్లు చేస్తేనే జీతాలు

ఆర్మూర్‌టౌన్: జిల్లాలో కొన్ని ప్రయివేట్ పాఠశాలలు.. అడ్మిషన్లు చేస్తేనే వేతనాలు అనే విధానంతో టీచర్లను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయని యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది సూరి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ పద్ధతివల్ల ఉపాధ్యాయులు సెలవుల సమయంలోనూ కాలనీల్లో తిరిగి విద్యార్థుల కోసం అడ్మిషన్ల పనిలో నలుగుతున్నారన్నారు. యాజమాన్యాలు ఒక్కో టీచర్‌కు కనీసం 10 అడ్మిషన్ల టార్గెట్ విధించినట్లు తెలుస్తోందన్నారు.ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు, జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేతలు నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



బోధన్: రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సాలూర పీహెచ్‌సీ వైద్యుడు రాజ్‌కుమార్ ప్రజలకు సూచించారు. శనివారం సాలూర రైతు వేదిక భవనంలో ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి వివరించారు. ప్రజల ఆరోగ్య రక్షణ విషయంలో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని వైద్య సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. తహసీల్దార్ శశిభూషణ్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మాక్లూర్: కల్లెడి గ్రామానికి చెందిన 11 మంది దరఖాస్తుదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను స్థానిక బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశం మేరకు బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రశయ్‌తేజ్ పంపిణీ చేశారు. స్థానిక బీజేపీ నాయకులు బాశెట్టి సత్యనారాయణ, గంగాధర్, అరుణ్, నాగేష్, ఎం.అర్జిత్, ఆర్.నవీన్, ప్రశాంత్, సాయికుమార్, మహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్ర వీడీసీ, లయన్స్ క్లబ్, పోలీసులు సంయుక్తంగా మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో 550పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలో ప్రతిభ పురస్కారాలను అందజేశారు. విద్యార్థులు ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో రవికుమార్, ఎస్సై రజనీకాంత్, ఏఎస్సై సురేశ్, ఎంపీవో గౌస్ మొయినొద్దీన్, లయన్స్, వీడీసీ సభ్యులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్ -11.05, శుభం -1.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్(తెలుగు)-4.30, హిట్ -7.00,ఎంఐ - 10.15

స్క్రీన్-4 ఎంఐ-10.00,4.20, డెవిల్స్ డబుల్ నెక్స్ లెవెల్ -1.30, సింగిల్ -5.05,7.50, ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ -10.35

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	96,400	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	88,985		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

నాలుగు మొబైల్ ఫోన్ల రికవరీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న 4 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో యజమానులకు అందించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. పోగొట్టుకున్న ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు తెలిపారు.

నేడు సీఎస్ఐ చర్చికి రూబెన్ మార్క్ రాక

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లిలోగల సీఎస్ఐ చర్చికి ఆదివారం ఇన్‌చార్జి మోడరేటర్ రూబెన్‌మార్క్ రానున్నట్లు చర్చి ఫాదర్ ప్రభాకర్, కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన చేశారు. సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రత్యేక ప్రార్థనలుంటాయని, పలు అభివృద్ధి కార్యక్రమాలను రూబెన్ ప్రారంభిస్తారని వెల్లడించారు.

గౌడ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో రూ.4 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టే గౌడ సంఘం భవనానికి బీజేపీ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. నాయకులు చింత ప్రవీణ్‌కుమార్, రెంజర్ల గంగాధర్, సున్నం మోహన్, శేఖర్‌గౌడ్, తోకల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవీపేట: కోస్లీలో రూ.4.95 లక్షల వ్యయంతో శ్మశానవాటికలో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి ఠాకూర్ రాహుల్, బీజేపీ నాయకులు కృష్ణ, నర్సింలు, శరత్, సందీప్, సాయిబాబా, రాజశేఖర్, లింగారెడ్డి పాల్గొన్నారు.

ముప్కాల్ మండలం నల్లూర్‌లో..

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో రూ.10 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె వాయిదా

నవీపేట: దేశవ్యాప్తంగా ఈ నెల 20న తలపెట్టిన సమ్మెను వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడీ శ్రీనివాస్ శనివారం తెలిపారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని.. సమ్మెను జులై 9కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

నైపుణ్యం పెంచడానికి ప్రత్యేక తరగతులు

వర్ని(మోస్రా): సాంకేతిక, అధునాతన పద్ధతుల్లో విద్య అందించడానికి వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మోస్రా ఎంఈవో నాగనాథ్ వెల్లడించారు. నేటి నుంచి ఐదు రోజులపాటు జరుగు శిక్షణ తరగతులను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆయన ప్రారంభించారు. డ్రాయింగ్ , డాన్స్, పాటల ద్వారా బోధన చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం బాలాజీరావు, ఉపాధ్యాయులు దివాకర్ పాల్గొన్నారు.

పిప్రిలో బడిబాట

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రిలో శనివారం ఉపాధ్యాయులు బడిబాట చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం వంటివి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు దయాసాగర్, ప్రవీణ్, దేవేందర్, తల్లిదండ్రులు, మహిళ సంఘాల సభ్యులున్నారు.